క్లుప్తంగా

రగ్బీ పోటీల్లో గొట్లగట్టు విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులతో హెచ్ఎం, పీడీ

కొనకనమిట్ల: ఇటీవల గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని హెచ్ఎం విజయలక్ష్మి, పీడీ బాలగురవయ్య పేర్కొన్నారు. పీడీ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు కె.వెంకటయ్య, చిరుత, అనుకు వెంకటేశ్వర్లు, బాలికల విభాగంలో చందలూరు వెంకట మహేశ్వరి, ఉల్సా చంద్రలిఖిత రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. వీరిలో చిరుత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్ఎం, పీడీ, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు అభినందించారు.

పల్లెల్లో సెమీ క్రిస్మస్ సందడి


గొట్లగట్టులో ప్రార్థన చేస్తున్న మహిళలు

కొనకనమిట్ల: గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. చర్చిలను సుందరంగా ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎస్సీ కాలనీల వద్ద క్రిస్మస్ స్టార్లు, బ్యానర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆదివారం గొట్లగట్టులోని సియోను ప్రార్థనా మందిరంలో పాస్టర్ కాశిరెడ్డి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధచూపాలి


మొక్కలు నాటుతున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బీఎస్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో హబీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మౌజన్లకు వేతనాలు చెల్లించాలి


సమావేశంలో పాల్గొన్న ముస్లిం సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: మసీదుల్లో పనిచేస్తున్న మౌజన్లకు వేతనాలు చెల్లించాలని ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషా కోరారు. పట్టణంలోని బిలాల్ మసీదులో ఆదివారం సంఘ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మసీదుల్లో పనిచేస్తున్న మౌజన్లు వేతనం అందక ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ముస్లింల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయబ్‌రసూల్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పొలంలో కేబుల్ తీగ చోరీ


కేబుల్ అపహరణకు గురైన పొలం

అర్థవీడు: పంట పొలంలోని వ్యవసాయ బోరుకు ఉన్న కేబుల్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లిన సంఘటన ఆదివారం పాపినేనిపల్లిలో చోటుచేసుకుంది. నల్లబోతుల అల్లూరయ్య అనే రైతు పొలం కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేసుకుంటున్నాడు. పంట పొలంలో ఉన్న సుమారు 50 మీటర్ల కేబుల్ వైరును అపహరించడంతో పంటకు నీరు పెట్టేందుకు ఇబ్బందిగా మారిందని రైతు వాపోయారు. ఇటీవల కాలంలో పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి రాగి తీగలు, కేబుల్స్ అపహరించడం అధికమయ్యాయని పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో మిర్చి రైతులు!


కల్లంలో ఆరబోసిన మిర్చి


వర్షం పడుతుండటంతో మిర్చిపై పట్ట కప్పుతున్న రైతు

- రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆందోళన
- కాయ నాణ్యతపై దిగులు
- పశ్చిమ ప్రకాశంలో 45,813.59 ఎకరాల్లో సాగు

మార్కాపురం:

అల్పపీడన ప్రభావంతో గత రెండురోజులుగా మార్కాపురం ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మిర్చి రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా ఆకాశమంతా మేఘావృతమైంది. అయితే శనివారం రాత్రి, ఆదివారం కురిసిన జల్లులతో మిర్చి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం మిర్చి కోతలు ప్రారంభమయ్యాయి. మిర్చి కోతల కోసం కూలీలకు అధిక కూలి చెల్లిస్తున్నారు. కాయలు ఆరబెట్టుకునేందుకు రైతులు కల్లాల్లోనే మిర్చిని ఉంచారు. ఊహించని విధంగా వరుసగా అల్పపీడనాల ప్రభావంతో ముసురు పట్టడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షానికి తడిస్తే మిర్చి తోటకు తెగుళ్లతోపాటు కాయ రంగు మారి నాణ్యత తగ్గుతుందని, ధర ఆశించిన స్థాయిలో ఉండదని మదనపడుతున్నారు. ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డు మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర 16 వేల రూపాయలు ఉంది. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్మడం లేదా నలుగురు, ఐదుగురు రైతులు కలిపి లారీని బాడుగకు మాట్లాడుకుని గుంటూరు మార్కెట్ యార్డుకు వెళ్తున్నారు. ఎకరాకు సుమారు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులకు హఠాత్తుగా కురుస్తున్న వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత రెండు రోజులుగా మార్కాపురం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, తర్లుపాడు తదితర మండలాల్లో ఓ మోస్తరు జల్లులు పడుతున్నాయి. దీంతో రైతులు హడావుడిగా కల్లాల్లో ఉన్న మిర్చి తడవకుండా పట్టలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.


మిర్చి తడవకుండా పట్ట కప్పిన రైతు

పశ్చిమ ప్రకాశంలో మిర్చి సాగు ఇలా

మండలం	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
మార్కాపురం	2657.52
దోర్నాల	5817.10
పెద్దారవీడు	4543.83
వై పాలెం	10409.49
త్రిపురాంతకం	5767.35
పుల్లలచెరువు	8098.75
గిద్దలూరు	893.33
రాచర్ల	1086
కొమరోలు	152.31
బేస్తవారపేట	910.59
కంభం	342.23
అర్థవీడు	2207.97
తర్లుపాడు	1520.42
కొనకనమిట్ల	765.01
పొదిలి	641.69
మొత్తం	45,813.59

జాగ్రత్తలు పాటించండి



మిరప తోటల్లో నీళ్ల నిలబడకుండా చూసుకోవాలి. తేమ ఉంటే 50 కేజీల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవాలి. తోటలో నీరుంటే వేరుకుళ్లు వచ్చే అవకాశం ఉంది. అలా ఉన్నట్లయితే 3 గ్రాముల కాపరాక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. కాయ కోతకు 20 రోజుల ముందు పురుగు మందు వాడరాదు. పూర్తిగా పండిన కాయలు మాత్రమే కోయాలి. మబ్బులతో కూడిన వాతావరణంలో కోతలు చేపట్టవద్దు. అపరిశుభ్రమైన సంచులు, ఎరువుల సంచుల్లో కాయలను నిల్వ ఉంచవద్దు. కోసిన కాయలను కల్లాల్లో ఎండబెట్టాలి. వాతావరణ పరిస్థితులను బట్టి 2 నుంచి 3 వారాలు ఎండబెట్టాలి.

– రమేష్, హార్టికల్చర్ అధికారి, మార్కాపురం

మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



పశ్చిమ ప్రకాశంలో రైతులు పండించిన మిర్చి కొనుగోలుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. రైతులు వర్షాలు పడితే కల్లాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు పట్టలను ప్రభుత్వం అందించాలి. దళారుల ప్రమేయం లేకుండా ఉండేలా ప్రభుత్వమే నేరుగా మిర్చిని కొనుగోలు చేయాలి.

– బాలనాగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

ఘనంగా రామానుజన్ జయంతి


గొట్లగట్టులో రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


గణిత బోధనోపకరణాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి

మార్కాపురం: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ విద్యార్థులందరికీ ఆదర్శమని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అన్నా కృష్ణచైతన్య పేర్కొన్నారు. ఆదివారం కిట్స్ కళాశాలలో రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గణితంపై భయాన్ని వీడాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి సూచించారు. విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గణిత అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ పీఓ అనిల్‌కుమార్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉర్దూ డీఐ మొయినుద్దీన్ పాల్గొని గణితం ప్రాముఖ్యతను, నిత్యజీవితంలో గణిత శాస్త్ర ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పరిశోధనకు ఉపయుక్తమైన గణిత బోధనోపకరణాలను ప్రదర్శించి, సూత్రాలను విశదీకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్య రామారావు, హబీబుర్ రహమాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆదివారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు గణిత నమూనాలు, చార్టులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు


వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న అన్నా రాంబాబు, జంకె తదితరులు

మార్కాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం రాత్రి పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మార్కాపురం మండలంలోని వేములకోట, కొట్టాలపల్లి, కొనకనమిట్ల మండలంలోని గనివెనపాడు, మార్కాపురం పట్టణంలోని పీఎస్‌కాలనీ, కొండారెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో కేకులు కట్ చేసి ఉత్సాహంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి తదితరులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. వారికి స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వేములకోటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వీరయ్య, జంకె వెంకట నారాయణరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, గుంజా గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఆదేశాల మేరకు పార్టీ నాయకులు దాదాపు 200 మంది నిరుపేద మహిళలతోపాటు పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జిల్లా నాయకులు గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, నూర్జహాన్‌బేగం, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

30 మంది వాహనదారులకు జరిమానా


వాహనదారులకు జరిమానా విధిస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న 30 మందికి జరిమానా విధించినట్లు టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు తెలిపారు. ఆదివారం వాహన తనిఖీల్లో లైసెన్స్, సీ బుక్, హెల్మెట్ లేనివారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. సోమవారం నుంచి హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొమరోలులో అధ్వానంగా పారిశుధ్యం


రహదారి పక్కనే నిలిచిన మురుగు


చెత్తాచెదారంతో నిండిపోయిన బ్రహ్మంగారి మఠం వీధి


శివాజీనగర్‌లో ఇళ్ల మధ్య చెత్తకుప్పలు

కొమరోలు: పారిశుధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో కొమరోలులోని పలు వీధులు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. కొమరోలులోని బ్రహ్మంగారి మఠం వీధి చెత్తాచెదారంతో నిండిపోయింది. పాత ఆంధ్రబ్యాంక్ ఎదురుగా, ప్రధాన రహదారిలో రెండు మద్యం దుకాణాలు ఉండటంతో మందుబాబులు పక్కనే ఉన్న బ్రహ్మంగారిమఠం వీధిలో మద్యం తాగి వ్యర్థాలు అక్కడే పడేస్తున్నారు. అలాగే స్థానిక శివాజీనగర్ కాలనీకి పంచాయతీ చెత్త ట్రాక్టర్ గాని, రిక్షాగానీ వెళ్లకపోవడంతో స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను రోడ్డు పక్కన పోస్తున్నారు. ఇస్లాంపేటలో తిప్పపై మంచినీటి ట్యాంక్ కుళాయిల నుంచి నీరు కారుతుండటంతో రహదారి వెంట నిలిచి మురుగుమయం అవుతోంది. పారిశుధ్య లోపంతో దోమలు విజృంభిస్తుండటంతో రోగాలబారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలు వీరే..

- 29న బహుమతులు పంపిణీ

బేస్తవారిపేట: చేయూత మిత్రమండలి ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. బేస్తవారిపేట మండలంలో ప్రథమ స్థానంలో జి.ఆకాష్(జెడ్పీహెచ్ఎస్ గలిజేరుగుళ్ల), ద్వితీయ స్థానంలో జి.తిరుమల నారాయణ(జెడ్పీహెచ్ఎస్ గలిజేరుగుళ్ల), తృతీయ స్థానంలో జె.బాబు(జెడ్పీహెచ్ఎస్ గలిజేరుగుళ్ల), బేస్తవారిపేట జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు పి.విజిత, పి.మౌనిక నిలిచారు. కంభం మండలంలో కె.సుస్మిత(జెడ్పీ బాలికల హైస్కూల్), ఎం.నాగషణ్ముఖ(జెడ్పీ బాలికల హైస్కూల్), ఎం.శివనందిని(జెడ్పీ హైస్కూల్ పెద్దనల్లకాల్వ) వరుస మూడు స్థానాల్లో ప్రతిభచాటారు. తర్లుపాడు మండలంలో మొదటి స్థానంలో ఎం.అరుణ్‌కుమార్(జెడ్పీ హైస్కూల్ తర్లుపాడు), రెండో స్థానంలో చెన్నారెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.వెంకట లీల, పి.గణేష్, మూడో స్థానంలో ఎ.మోహన(జెడ్పీ హైస్కూల్, తర్లుపాడు) నిలిచారు. టాలెంట్ టెస్ట్‌లో మొదటి, రెండో, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదును ప్రోత్సాహక బహుమతిగా ఈ నెల 29న బేస్తవారిపేట చేయూత మిత్రమండలి కార్యాలయంలో అందజేస్తామని పేర్కొన్నారు.

గాండ్ల తెలికుల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా కృష్ణారావు


కృష్ణారావు

పొదిలి: గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా పొదిలికి చెందిన చిట్టింశెట్టి వెంకట కృష్ణారావు ఎన్నికయ్యారు. ఆదివారం నెల్లూరులోని పరమేశ్వరి కళ్యాణ మండపంలో సంక్షేమ సంఘ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. గాండ్ల సామాజిక వర్గానికి కృష్ణారావు అందిస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకుని గౌరవాధ్యక్షునిగా ఎంపిక చేశారని సంఘ ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయి సంఘ కార్యవర్గ సభ్యులు కృష్ణారావుకు అభినందనలు తెలిపారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరిపోలేరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పోలేరమ్మ అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మొక్కుబడి ఉన్న భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే స్థానిక కళాశాల రోడ్డులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అర్చకుడు అమర్‌నాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

పద్మశాలీ సంఘ అధ్యక్షుడిగా రవీంద్ర


పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పద్మశాలీ సంఘ అధ్యక్షుడిగా గంజి రవీంద్రను ఎన్నుకొన్నట్లు ఆదివారం కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో పద్మశాలీ సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడంతోపాటు సమస్యలు పరిష్కరించుకుంటూ సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు పేర్కొన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శిగా కె.ఆదినారాయణ, కోశాధికారిగా జి.గోపీనాథ్, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పద్మశాలీ యువసేన రాష్ట్ర ప్రతినిధి జి.రామాంజనేయులు అభినందించారు.